క్లుప్తంగా

రక్తదాన శిబిరానికి విశేష స్పందన



వినుకొండ(నూజెండ్ల): అబిల్ కలామ్ థెరిస్సా సేవా సొసైటీ ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రభుత్వ హాస్పిటల్‌లో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని పట్టణ సీఐ సాంబశివరావు ప్రారంభించి మాట్లాడుతూ సంస్థ చేస్తున్న సేవలను కొనియాడారు. జన్మనిచ్చే తల్లుల కోసం రక్తదాన శిబిరం ఏర్పాటు చేయడం వల్ల నిరుపేద మహిళలకు ఎంతో ఊరట కలుగుతుందన్నారు. రక్తదానం చేసిన ప్రతిఒక్కరినీ ఆయన అభినందించారు. కార్యక్రమంలో ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ ఎస్‌కే అబ్దుల్‌రజాక్, సంస్థ వ్యవస్థాపకురాలు చందోలు నాగవాణి, కన్వీనర్ డాక్టర్ రవి, ఎంఎస్ బాబు, తోట హనుమ, వెంకట్రావు, డి.రాజు, అభిషేక్ ప్రిన్స్, సుబ్బు, సుధాకర్, సాగర్, వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వార్డుల్లో ఫాగింగ్ డ్రైవ్



నరసరావుపేట: పురపాలక పరిధిలో దోమల నివారణకు ప్రత్యేక ఫాగింగ్ డ్రైవ్ చేపట్టినట్లు మున్సిపల్ కమిషనర్ సి.రవిచంద్రారెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు సమకూర్చుకున్న అధునాతన ఫాగింగ్ మిషన్లను గురువారం ప్రారంభించారు. ఒక మెగా ఫాగింగ్ మిషన్, ఆరు హ్యాండ్ ఫాగింగ్ మిషన్ల సహాయంతో పట్టణంలో ప్రతి రెండు, మూడు రోజులకు ఒకసారి 34 వార్డుల్లో పూర్తిస్థాయిలో ఫాగింగ్ చేయటం జరుగుతుందన్నారు. ఇందుకు సంబంధించి ఒక షెడ్యూల్ ఏర్పాటు చేయాలని సంబంధిత శానిటేషన్ అధికారులను ఆదేశించామన్నారు. మున్సిపల్ ఇంజినీర్ కనకరావు, మున్సిపల్ డిప్యూటీ ఇంజినీర్ ఓలేటి శ్రీనివాసరావు, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ రామకోటయ్య పాల్గొన్నారు.

పాముకాటుతో రైతు మృతి



ఈపూరు: వరిపైరులో పురుగుమందు పిచికారీ చేస్తుండగా వ్యక్తి పాము కాటుకు గురై మృతి చెందాడు. మండలంలోని బొగ్గరం గ్రామానికి చెందిన రైతు పసుపులేటి ఏడుకొండలు (41) తన కుమారుడితో కలిసి వరి పొలంలో పురుగుల మందు పిచికారీ చేస్తుండగా పాము కాటు వేయడంతో ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. కుమారుడు కేకలు వేయడంతో సమీప పొలాల్లోని వారు వచ్చి ఏడుకొండలును ఆర్ఎంపీ వద్దకు తీసుకెళ్లే లోపే మృతిచెందినట్లు బంధువులు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఏడుకొండలుకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

అగ్నికి ఆహుతైన సుబాబుల్ తోట

నాదెండ్ల: సాతులూరు గ్రామంలో గుర్తుతెలియని వ్యక్తి సిగరెట్ తాగి పడేయటంతో ఎకరన్నర విస్తీర్ణంలో ఉన్న సుబాబుల్ తోట అగ్నికి ఆహుతైన సంఘటన గురువారం చోటు చేసుకుంది. నరసరావుపేట ఫైర్ ఆఫీసర్ ఎంవీ సుబ్బారావు తెలిపిన వివరాల మేరకు, గ్రామానికి చెందిన వజ్జా కృష్ణ వ్యవసాయ పనులు చేసుకుని జీవిస్తుంటాడు. తన కున్న పొలంలో రెండేళ్ల క్రితం సుబాబుల్ తోట వేశాడు. అయితే గుర్తుతెలియని వ్యక్తులు మద్యం సేవించి సిగరెట్ తాగి తోటలో పడవేశారు. సిగరెట్ ఎండుటాకులపై పడటంతో మంటలు చెలరేగి తోటలోని చెట్లన్నీ అగ్నికి ఆహుతయ్యాయి. భారీగా ఆస్తి నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు వాపోయాడు. సకాలంలో ఫైర్ సిబ్బంది స్పందించటంతో చుట్టూ ఉన్న తోటలకు ఎలాంటి నష్టం జరగకుండా కాపాడగలిగారు.

31తో పూర్తికానున్న ప్రవేశ పరీక్ష గడువు

రొంపిచర్ల: మండలంలోని వి.రెడ్డిపాలెం ఏపీ మోడల్ స్కూల్‌లో ఆరవ తరగతి ప్రవేశం కోరు విద్యార్థులు ప్రవేశ పరీక్షకు ఈ నెల 31వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ బి. రవినాయక్ గురువారం తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వంచే గుర్తింపు పొందిన పాఠశాలలో 5వ తరగతి చదివిన విద్యార్థులు ప్రవేశ పరీక్షకు అర్హులన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థుల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. మరిన్ని వివరాలకు పాఠశాలలో సంప్రదించాలన్నారు.

దేవతామూర్తుల ప్రతిష్ఠోత్సవం

అనంతవరం(క్రోసూరు): అనంతవరం గ్రామంలో జీర్ణోద్ధరణ పూర్తయిన దేవతామూర్తుల రావి గురునాథ స్వామి, ప్రసన్నాంజనేయస్వామి, పోలేరమ్మ తల్లి, అంకమ్మ, గంగమ్మ తల్లి, పోతురాజు స్వామి విగ్రహ, జీవ ధ్వజ ప్రతిష్ఠా మహోత్సవంలో గురువారం ఎమ్మెల్యే నంబూరు శంకరరావు పాల్గొన్నారు. స్వామి వార్ల ఆశీస్సులతో నియోజకవర్గంలో ప్రజలందరూ సుఖశాంతులతో, ఆయురారోగ్యాలతో, పాడిపంటలతో ఉండాలని మొక్కుకున్నారు.

అభివృద్ధి, సంక్షేమమే వైఎస్సార్ సీపీ ధ్యేయం

- బుచ్చిబాపన్నపాలెం వారితో ఎంపీ అభ్యర్థి డాక్టర్ అనిల్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి
- బీసీ కాలనీలో పార్టీలో చేరిన 40 కుటుంబాలు
- టీడీపీలో చేరారనడం అబద్ధం



పార్టీలో చేరిన బీసీ కాలనీ వాసులతో ఎంపీ, అసెంబ్లీ అభ్యర్థులు డాక్టర్ పి.అనిల్, డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేట: వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిననాటి నుంచి బడుగు, బలహీన వర్గాలకు అండగా నిలవటమే కాకుండా ఆర్థికంగా చేయూత నందిస్తూ వారి సంక్షేమాన్ని కాంక్షించిందని పార్లమెంటు, అసెంబ్లీ అభ్యర్థులు డాక్టర్ అనిల్ కుమార్ యాదవ్, డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు.

గురువారం 34వ వార్డు బీసీ కాలనీలో పార్టీలో చేరిన పలువురికి కండువాలను కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ వైఎస్సార్ సీపీకి బీసీలు వెన్నెముకలాంటివారన్నారు. బీసీ,ఎస్టీ, ఎస్సీ,మైనారిటీలకు అండగా నిలిచే పార్టీ తమది అన్నారు. 40 బీసీ కుటుంబాలు పార్టీలో చేరడం చాలా సంతోషకరమైన విషయమన్నారు పార్లమెంట్ అభ్యర్థి అనిల్ కుమార్ యాదవ్‌ను గెలిపించుకోవటం ద్వారా నరసరావుపేట పార్లమెంట్ పరిధిలో బీసీలకు పెద్దపీట వేస్తామని ఎమ్మెల్యే గోపిరెడ్డి స్పష్టం చేశారు.

టీడీపీలో చేరిక అబద్ధం

కోట్ల రూపాయలు ఇచ్చినా ఓటు మారని గ్రామం బుచ్చిబాపన్నవారిపాలెమని ఎమ్మెల్యే, అసెంబ్లీ అభ్యర్థి డాక్టర్ గోపిరెడ్డి అన్నారు. అలాంటి వారు టీడీపీలో చేరారంటూ చెప్పడంలో ఎలాంటి నిజం లేదన్నారు.నోటు ఆశ చూపించి ఓటు లాక్కోవాలనే భ్రమలో టీడీపీ అభ్యర్థి అరవింద్ బాబు ఉన్నారని, అరవింద్ బాబుకు రాజకీయ పరిజ్ఞానం శూన్యమన్నారు. రాజకీయాన్ని అబద్ధం చేయడం అతని వల్లే సాధ్యమైందని గోపిరెడ్డి విమర్శించారు. గతంలో కంటే ఈ ఎన్నికల్లో ఎక్కువ ఓట్లు పడతాయని విశ్వాసం వ్యక్తం చేశారు. నిజమైన కార్యకర్తలెవరూ నోటుకు లలొంగరని, రానున్న ఎన్నికల్లో అరవింద్ బాబుకు ఓటుతో సమాధానం చెప్పాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పల్నాడు జిల్లా నగరాభివృద్ధి అథారిటీ చైర్మన్ మిట్టపల్లి రమేష్, స్థానిక వార్డు నాయకులు పాల్గొన్నారు.

జగనన్న సైనికుల్లా పనిచేయాలి

వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కావటి మనోహర్‌నాయుడు



సోషల్ మీడియా సభ్యులతో కలసి సిద్ధం స్టిక్కర్లు ప్రదర్శిస్తున్న కావటి మనోహర్‌నాయుడు

చిలకలూరిపేట: సోషల్ మీడియా సభ్యులు జగనన్న సైనికుల్లా పనిచేయాలని... ఐదేళ్ల కాలంలో ప్రభుత్వం ద్వారా ప్రజలకు చేకూరిన లబ్ధిని అన్ని వర్గాల వారికి వివరించే విషయంలో ముందంజలో ఉండాలని వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కావటి శివనాగ మనోహర్ నాయుడు చెప్పారు. సోషల్ మీడియా మిత్రులతో పట్టణంలోని బ్యాంకు కాలనీలో ఉన్న మనోహర్‌నాయుడు ఎన్నికల కార్యాలయంలో గురువారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ముందుగా సోషల్ మీడియా గ్రూపు సభ్యులతో పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నవరత్న సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అన్ని వర్గాల ప్రజలకు మేలు చేశారని వివరించారు. ఆయా పథకాలను కులం, మతం, వర్గం, పార్టీ వ్యత్యాసాలు లేకుండా అర్హతే ప్రామాణికంగా పారదర్శకంగా అమలు చేశారని తెలిపారు. ఆయా విషయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత పార్టీ సోషల్ మీడియా సభ్యులపై ఉందన్నారు. సోషల్ మీడియా సభ్యులంతా సమన్వయంతో మళ్లీ వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చేంత వరకు శక్తివంచన లేకుండా పని చేయాలని వెల్లడించారు. ప్రతిపక్ష నాయకులు చేస్తున్న అసత్య ప్రచారాలను ఎప్పటికప్పుడు ప్రజలకు తెలియజేయాలన్నారు. జగనన్నను తిరిగి సీఎంను చేసుకునేందుకు పోరాటయోధుల్లా పనిచేయాలని పిలుపు నిచ్చారు.

వైభవంగా కోదండరామాలయ భూమి పూజ



సాతులూరులో భూమిపూజలో పాల్గొన్న ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్

నాదెండ్ల: సాతులూరు గ్రామ పరిధిలోని గుంటూరు–కర్నూలు జాతీయ రహదారి పక్కనే రూ.కోటి వ్యయంతో నిర్మించనున్న కోదండరామస్వామి ఆలయానికి గురువారం భూమి పూజ వైభవంగా నిర్వహించారు. వేదపండితులు చిలకపాటి భర ద్వాజ ఆధ్వర్యంలో పూజలు జరిపారు. అనంతరం పునాదుల్లో నవధాన్యాలు వేసి పూజ చేశారు. గతంలో ఈ దేవాలయం పల్లంగా ఉండటం, వర్షాకాలంలో నీరు చేరుతుండటంతో జీర్ణోద్ధరణ పనులు చేపట్టారు. వచ్చే ఏడాది నాటికి ఆలయం నిర్మాణ పనులు పూర్తి చేసి ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్, వైఎస్సార్ సీపీ నాయకులు గద్దె కోటేశ్వరరావు, కమ్మ సీతారామయ్య, గొర్రె శివ, రావుల శ్రీనివాసరావు, జెట్టిపాటి సురేష్, కుంచాల చెన్నకేశవులు, మేడా ప్రసాద్, కొమ్మనబోయిన కొండలు, బండారుపల్లి వెంకటరెడ్డి పాల్గొన్నారు.

ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు చర్యలు

డీఎస్పీ వర్మ



మాట్లాడుతున్న డీఎస్పీ వర్మ, ఆర్వో సుబ్బారావు

వినుకొండ(నూజెండ్ల): సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు పటిష్టమైన చర్యలు చేపట్టినట్లు నరసరావుపేట డీఎస్పీ సత్యనారాయణ వర్మ తెలిపారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నియోజకవర్గ ఎన్నికల అధికారి వరదా సుబ్బారావు కలిసి ఐదు మండలాల పోలీస్ అధికారులు, ఎన్నికల విధులు నిర్వహిస్తున్న అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎన్నికల నియమావళి ప్రకారం నిబంధనలు కఠినంగా అమలు చేయాలని నరసరావుపేట, చిలకలూరిపేట నియోజకవర్గాల పరిధిలోని 11 చెక్‌పోస్టులు ఏర్పాటు చేశామని, రూ.10వేలు విలువ కలిగిన సామాగ్రి తరలించేటప్పుడు తప్పనిసరిగా బిల్లులు దగ్గర ఉంచుకోవాలని, రూ.50వేలు నగదు పైగా తరలించినట్లయితే డబ్బులకు సంబంధించిన ఆధారాలు తప్పనిసరిగా చూపించాలని, లేనిపక్షంలో వస్తువులను, నగదును సీజ్ చేయాలని సూచించారు. అనధికారికంగా సామగ్రి ఉన్నట్లు తెలిస్తే చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ప్రజాప్రతినిధులు మీటింగ్‌లకు, వాహనాలకు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని చెప్పారు. ఎన్నికల నియమావళిని కఠినతరంగా అమలు చేయాలని, ఎప్పటికప్పుడు సమాచారాన్ని ఉన్నతాధికారులకు తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో వినుకొండ టౌన్, రూరల్ సీఐలు, ఐదు మండలాల ఎస్‌ఐలు, తహసీల్దార్‌లు, ఎంపీడీవోలు, ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.

శావల్యాపురం స్టేషన్ సందర్శన

శావల్యాపురం: నరసరావుపేట డీఎస్పీ వత్సవాయి సత్యనారాయణవర్మ గురువారం స్థానిక పోలీసు స్టేషను సందర్శించి సిబ్బందికి దిశనిర్దేశం చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఎలాంటి గొడవలు అల్లర్లకు తావులేకుండా సమస్యాత్మక గ్రామాల్లో పోలీసు నిఘా ఉంచామని ముందుస్తుగా ఇరుపార్టీల నాయకులపై బైండవర్ కేసులు నమోదు చేశామని, పటిష్ఠమైన బందోబస్తు నడుమ ఎన్నికల జరుగుతాయని ఆయన వివరించారు. అనంతరం ఆ యా స్టేషన్లు పరిసరాలు పరిశీలించారు. ఆయనతో పాటు ఎస్సై చల్లా సురేష్ రైటరు శ్రీనివాసరావులు ఉన్నారు.

సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేకదృష్టి

ఈపూరు: సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేకదృష్టి సారిస్తున్నట్లు నరసరావుపేట డీఎస్పీ వి.ఎస్.ఎన్. వర్మ అన్నారు. త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల సందర్భంగా మండలంలోని కొచ్చర్ల, అంగలూరు, ఇనిమెళ్ల, బొమ్మరాజుపల్లి పోలింగ్‌బూత్‌లను ఆయన గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి బూత్‌కు ఏ విధంగా వసతులు ఏర్పాటు చేసింది పరిశీలిస్తున్నామన్నారు. ఏమైనా సమస్యలు ఉంటే గ్రామాల్లో ప్రజలు నేరుగా తమ దృష్టికి తీసుకురావాలని వర్మ అన్నారు. ఆయన వెంట రూరల్ సీఐ సుధాకర్, ఎస్‌ఐ ఫిరోజ్ తదితరులు ఉన్నారు.

ఘనంగా గ్రాడ్యుయేషన్ డే వేడుకలు



చిన్నారులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎంఈవో జఫ్రుల్లా, సీఐ సాంబశివరావు

వినుకొండ(నూజెండ్ల): స్థానిక నరసరావుపేట రోడ్డులోని గంగినేని కళ్యాణ మండపంలో గీతమ్స్ విద్యాసంస్థల గ్రాడ్యుయేషన్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంఈవో సయ్యద్ జఫ్రుల్లా, టౌన్ సీఐ సాంబశివరావులు పాల్గొని ప్రసంగించారు. విద్యార్థులు చక్కగా క్రమశిక్షణతో చదువుకోవడంలో ఉపాధ్యాయుల కృషి ఎంతో ఉంటుందనీ, తల్లిదండ్రులు ప్రతి ఒక్క చిన్నారిని పాఠశాలల్లో చేర్పించి నిరక్షరాస్యతను దూరం చేసే విధంగా పాటుపడాలన్నారు. అనంతరం విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులను అలరించాయి. కార్యక్రమంలో గీతమ్స్ విద్యాసంస్థల కరస్పాండెంట్ మాలపాటి కోటిరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ ద్వారా బైబిల్ క్లాసులకు సంప్రదించండి

నరసరావుపేట: గూగుల్ మీట్ (ఆన్‌లైన్) ద్వారా బైబిల్ క్లాసులు నిర్వహించి సర్టిఫికేట్ అందజేయటం జరుగుతుందని క్రైస్తవ సంఘాల ఆదరణ సంక్షేమ సమితి అధ్యక్షులు కె.అశోక్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులచే ప్రతిరోజు సాయంత్రం 7.30 నుంచి 9గంటలవరకు ఆన్‌లైన్ క్లాసులు జరుగుతాయన్నారు. వీటికి హాజరైన అభ్యర్థులకు బెంగుళూరుకు చెందిన నేషనల్ అసోసియేషన్ ఫర్ థియాలాజికల్ అక్రిడిటేషన్ (నాటా) ద్వారా సర్టిఫికేట్ అందజేయటం జరుగుతుందన్నారు. రొంపిచర్ల మండలంలోని మునుమాక గ్రామంలో బ్రాంచ్ కార్యాలయం ఉందని, ఆసక్తిగలవారు కార్యాలయం , 97000 10017, 88865 21001 సంప్రదించాలని కోరారు.

మతసామరస్యానికి ప్రతీక రంజాన్



హాజరైన ముస్లిం సోదరులు



ఇఫ్తార్ విందులో పాల్గొన్న వారిని పలుకరిస్తున్న కావటి మనోహర్‌నాయుడు

వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కావటి మనోహర్‌నాయుడు

చిలకలూరిపేట: మత సామరస్యానికి ప్రతీక రంజాన్ అని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కావటి శివనాగ మనోహర్ నాయుడు చెప్పారు. పట్టణంలోని ముస్లిం కమ్యూనిటీ హాలులో మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు గురువారం రాత్రి ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రార్థనల్లో కావటి మనోహర్‌నాయుడు పాల్గొన్నారు. ముస్లిం సాంప్రదాయబద్ధంగా దువా చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రంజాన్ మాసం ఎంతో పవిత్రమైనదని చెప్పారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముస్లింల అభ్యున్నతి కట్టుబడి ఉన్నారని వెల్లడించారు. నాడు ముస్లింలకు నాలుగు శాతం రిజర్వేషన్లు ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్.రాజశేఖరరెడ్డి కల్పించిన విషయాన్ని గుర్తు చేశారు. తండ్రి బాటలోనే ఆయన తనయుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముస్లిం సంక్షేమానికి ఎన్నో కార్యక్రమాలు చేపట్టారని పేర్కొన్నారు. గత ఎన్నికల్లో ముస్లింలకు ఐదు అసెంబ్లీ స్థానాలు కేటాయించగా, వారిలో ఒకరు ఓడిపోతే వారికి కూడా ఎమ్మెల్సీగా అవకాశం కల్పించారని గుర్తు చేశారు. ఒకరికి ఏకంగా ఉప ముఖ్యమంత్రి పదవి ఇచ్చి గౌరవించారని వెల్లడించారు. ఈ అసెంబ్లీ ఎన్నికల్లో ఏడుగురు ముస్లింలకు ఎమ్మెల్యేలుగా పోటీ చేసేందుకు అవకాశం కల్పించారని తెలిపారు. అదే విధంగా మున్సిపల్ చైర్మన్లుగా, మేయర్లుగా, రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేనంత మందికి అవకాశం కల్పించటంతో పాటు నామినేటెడ్ పదవుల్లోనూ సముచిత స్థానం కల్పించారని తెలిపారు. ఈ సందర్భంగా అందరికీ రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ముస్లిం నాయకులు సయ్యద్ బషీర్ మేస్త్రి, మౌలానా మొహమ్మద్ అబ్బాస్‌ఖాన్, షేక్ గాలిబ్‌షా, షేక్ అల్లీమియా, పఠాన్ తలహాఖాన్, ఏఎంఎం సుభాని, షేక్ దరియావలి, షేక్ కరిముల్లా, షేక్ అబ్దుల్ గని, ఆర్కేబాజి, సయ్యద్ సిరాజ్, మున్సిపల్ కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరి లక్ష్యం వైనాట్ 175 కావాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి, డాక్టర్ గజ్జల, గులాబ్‌రసూల్

నరసరావుపేట: ప్రతి ఒక్కరి లక్ష్యం వైనాట్ 175 కావాలని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి నాయకులు, కార్యకర్తలకు పిలుపు నిచ్చారు. గురువారం రాత్రి జమిందారు ఫంక్షన్ హాలులో పార్టీ జిల్లా కోశాధికారి ఎస్‌కే ఆంజనేయులు అధ్యక్షతన నిర్వహించిన నియోజకవర్గస్థాయి కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశంకు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రతి ఒక్క నాయకుడు కార్యకర్తలను కలుపుకొని ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పార్టీ విజయానికి కృషి చేయాలన్నారు. జిల్లాలో గెలిచే సీట్లలో నరసరావుపేట ప్రథమంగా ఉండాలని అన్నారు. చంద్రబాబుకు విశ్వసనీయతే లేదన్నారు. 2019లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీని తిట్టి ఇప్పుడు మళ్లీ అతనితో కలిసి ఎన్నికలకు సిద్ధమయ్యాడన్నారు. బాపట్ల నియోజకవర్గ పరిశీలకులు, సీనియర్ నాయకులు డాక్టర్ గజ్జల బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ పార్టీకి కార్యకర్తలే పునాదులని, ఎటువంటి ప్రలోభాలకు లొంగకుండా పార్టీ గెలుపుకు కృషి చేయాలన్నారు. అందరూ ఎంతకష్టపడితే నియోజకవర్గంలో అంత మెజార్టీ వస్తుందని చెప్పారు. పార్టీ నియోజకవర్గ పరిశీలకులు గులాబ్‌రసూల్ మాట్లాడుతూ నరసరావుపేటలో వైఎస్సార్‌సీపీ గెలుస్తుందని చంద్రబాబుకు ముందే తెలుసునన్నారు. యరపతినేని శ్రీనివాసరావు, జంగా కృష్ణమూర్తిలను పోటీచేయమని కోరి నా వారు వెనక్కు తగ్గారని గుర్తు చేశారు. మాజీ మార్కెట్‌యార్డు చైర్మన్ ఎస్‌ఏ హనీఫ్ మాట్లాడుతూ 2019లో వైఎస్సార్‌సీపీకి మొత్తం 90పోలింగ్ బూత్ లలో 78 బూతులలో మెజార్టీ వచ్చిందని, 11 టీడీపీ, ఒక దానిలో జనసేనకు వచ్చిందన్నారు. తామందరమూ వైఎస్సార్‌సీపీ విజయానికి కృషిచేసి హ్యాట్రిక్ సాధిస్తామని పేర్కొన్నారు. పార్టీ డాక్టర్ సెల్ ప్రతినిధి డాక్టర్ కారసాని శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ అందరూ చేతులు మడతపెట్టి ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డి, ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులుగా డాక్టర్ అనీల్‌కుమార్, డాక్టర్ గోపిరెడ్డిలను గెలిపించేందుకు అందరూ సంసిద్ధంగా ఉండాలంటూ ఉత్సాహ పర్చారు. డాక్టర్ గజ్జల సుధీర్‌భార్గవరెడ్డి మాట్లాడుతూ నరసరావుపేటలో వచ్చే మెజార్టీ ఎంపీ అభ్యర్థి డాక్టర్ అనీల్‌కుమార్ గెలుపుకు తోడ్పడాలని కోరారు. పల్నాడు జిల్లా అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్ మిట్టపల్లి రమేష్ మాట్లాడుతూ జగన్ మోహన్‌రెడ్డిని సీఎంచేసేందుకు ప్రజలు నిర్ణయించుకున్నారన్నారు. షేక్ కార్పొరేషన్ చైర్మన్ ఆషాభేగం ఖాజావలి, ముదిరాజు, స్వచ్ఛాంధ్ర, గిరిజిన కార్పొరేషన్ డైరక్టర్లు ఇయం.స్వామి, ఎస్.సుజాతాపాల్, పాలపర్తి వెంకటేశ్వరరావు, రొంపిచర్ల జెడ్పీటీసీ సభ్యులు పిల్లి ఓబులురెడ్డి, జిల్లా యువజన విభాగ అధ్యక్షులు పడాల సాంబశివారెడ్డి, నాయకులు వేముల శివ, కాపులపల్లి ఆదిరెడ్డి, మల్లెల అశోక్ మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు రామిశెట్టి కొండ, అచ్చిశివకోటి, సురేంద్ర కార్యకర్తలు పాల్గొన్నారు.



లెఫ్ట్-రైట్..

ఎప్పుడూ రద్దీగా ఉండే వినుకొండ పట్టణం గురువారం సైనిక బలగాల బూట్ల చప్పుళ్లతో, లెఫ్ట్‌రైట్ అరుపులతో ధ్వనించింది. మరికొద్ది రోజుల్లో జరుగనున్న సార్వత్రిక ఎన్నికలకు తామంతా సిద్ధంగా ఉన్న విషయాన్ని తెలియచేస్తూ.. స్వేచ్ఛగా మీరంతా ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచిస్తూ బలగాలు వడివడిగా ముందుకు సాగాయి. వీరందరికీ నరసరావుపేట డీఎస్పీ వర్మ, పట్టణ రూరల్ సీఐలు సాంబశివరావు, సుధాకర్, ఎస్ఐలు సారథ్యం వహించి ముందుకు నడిపించారు.

– వినుకొండ (నూజెండ్ల)

పన్ను చెల్లించేందుకు ప్రత్యేక కౌంటర్లు

నరసరావుపేట: ఆస్తిపన్ను, కుళాయి పన్నులు చెల్లించేందుకు పురపాలకసంఘ కార్యాలయంలో శుక్ర, శని, ఆదివారాల్లో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటుచేసినట్లు మున్సిపల్ కమిషనర్ సి.రవిచంద్రారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 31 లోగా పన్నులు చెల్లించి వడ్డీ రాయితీ పొందాలని ఆయన సూచించారు.

రేపు వైఎస్సార్ సీపీ విస్తృతస్థాయి సమావేశం


నాదెండ్ల: చిలకలూరిపేట ఎస్ఎంఎస్ గార్డెన్స్‌లో (షాదీఖానా) వైఎస్సార్ సీపీ నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశం శనివారం నిర్వహించనున్నట్లు నాదెండ్ల మండల ఎంపీపీ తలతోటి రాణి జెడ్పీటీసీ కాట్రగడ్డ మస్తాన్‌రావు, మండల పార్టీ అధ్యక్షుడు మద్దూరి కోటిరెడ్డి తెలిపారు. ఉదయం 10 గంటలకు జరిగే ఈ సమావేశానికి మండల పరిధిలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ వివిధ హోదాల్లో ఉన్న నాయకులు, కార్యకర్తలు, శ్రేయోభిలాషులు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు. కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థి అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్యే అభ్యర్థి కావటి శివనాగ మనోహర్ నాయుడు, రాజ్యసభ సభ్యులు ఆళ్ల అయోధ్య రామిరెడ్డి, వైద్య ఆరోగ్య శాఖా మంత్రి విడదల రజిని, ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్, నియోజకవర్గ పార్టీ పరిశీలకులు చిట్టా విజయ భాస్కరరెడ్డి హాజరుకానున్నట్లు తెలిపారు.

యడ్లపాడు: వైఎస్సార్‌సీపీ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశానికి మండలంలోని ప్రతి కార్యకర్తలు ఒక్కటై తరలి రావాలని యడ్లపాడు మండలం వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు ఘంటా శంకర్ విలేకరుల సమావేశంలో పిలుపునిచ్చారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి చల్లా యజ్ఞేశ్వరరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ రాచమంటి చింతారావు, నాయకులు ఎంపీ బాలచంద్రారెడ్డి, ఆలోకం వెంకట లక్ష్మీనారాయణ, గౌరు రాజేష్, కల్లూరి రామకృష్ణ, మద్దిపాలెం సొసైటి చైర్మన్ ఓరుగంటి పూర్ణయ్య, కర్నాటి సుబ్బారావు, నాయకులు రాచమంటి చింతారావు, యలగాల సాయి, చాగంటి శ్రీధర్ పాల్గొన్నారు.

3న పింఛన్ల పంపిణీ

నాదెండ్ల: వైఎస్సార్ పెన్షన్ కానుక సామాజిక భద్రతపింఛన్లను ఏప్రిల్ 3న పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీవో షేక్ జాకీర్‌హుస్సేన్ తెలిపారు. ఈ నెల 31, ఏప్రిల్ 1న బ్యాంకులకు సెలవు దినాలు కావటంతో 3వ తేదీన పింఛను నగదు పంపిణీ చేయనున్నట్లు ఆయన తెలిపారు.

15 వరకు ఓటరుగా దరఖాస్తుకు అవకాశం



ముప్పాళ్ల: కొత్తగా ఓటు హక్కు పొందేందుకు ఏప్రిల్ 15 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని తహసీల్దారు పి.సింగారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల సంఘం నూతన ఓటర్లకు మరో అవకాశం కల్పించిందని, 2024 ఏప్రిల్ 1 నాటికి 18 సంవత్సరాలు నిండిన వారంతా ఓటు హక్కు పొందేందుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.